## క్లుప్తంగా

### సీఎంఆర్ఎఫ్ పేదలకు మేలు



చెక్కు అందిస్తున్న కాంగ్రెస్ ఇన్‌చార్జి రాజిరెడ్డి

**నర్సాపూర్:** సీఎం రిలీఫ్ ఫండ్‌తో పేదలకు మేలు జరుగుతుందని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక తన క్యాంపు కార్యాలయంలో వెల్దుర్తి మండలంలోని మానెపల్లికి చెందిన గొల్ల మల్లయ్యకు సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎంఆర్ఎఫ్‌తో అత్యవసర సమయంలో వైద్యం అందుతుందని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నరేందర్‌రెడ్డి ఉన్నారు.

### ప్రకృతి పరిరక్షణ వేడుకలు




విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న జీఎమ్మార్ ప్రతినిధులు

**మనోహరాబాద్(తూప్రాన్):** మండలంలోని కూచారం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో జీఎమ్మార్ వరలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రకృతి పరిరక్షణ వేడుకలను నిర్వహించారు. సోమవారం ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను నిర్వహించి, ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ మేనేజర్ వెంకటరమణ ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. కార్యక్రమంలో కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ కృష్ణతేజ, ఫౌండేషన్ ప్రతినిధి లక్ష్మణరావు, కోఆర్డినేటర్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### చికిత్స పొందుతూ వివాహిత మృతి

- మృతికి భర్త కారణమంటూ ఆందోళన



లత (ఫైల్)

**శివ్వంపేట(నర్సాపూర్):** చికిత్స పొందుతూ వివాహిత మృతి చెందగా, భర్త కొట్టడంతోనే ఆమె మృతి చెందిందని బంధువులు ఆందోళన చేసిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాదు జిల్లా కుమ్మరిగూడ గ్రామానికి చెందిన లత(33)ను మండల పరిధిలోని నవాబుపేట గ్రామానికి రాంపల్లి రాజిరెడ్డితో వివాహం జరిగింది. ఈ నెల 9న భార్యా భర్తల మధ్య గొడవ అయింది. ఆమె అస్వస్థతకు గురికావడంతో తూప్రాన్‌లోని ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం సూరారంలోని మల్లారెడ్డి ఆస్పత్రికి తరలించిగా.. ఆదివారం అర్ధరాత్రి మృతిచెందింది.ఈ విషయం తెలుసుకున్న మృతురాలు బంధువులు భర్త కొట్టడంతోనే మృతి చెందిందని ఆందోళన చేశారు. మృతురాలి తండ్రి సుబాన్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మైహిపాల్‌రెడ్డి తెలిపారు.

### నిరుద్యోగ కళాకారులకు ఉద్యోగాలివ్వండి

**మెదక్‌జోన్:** తెలంగాణ ఉద్యమంలో పనిచేసిన నిరుద్యోగ కళాకారులకు ప్రభుత్వం సాంస్కృతిక సారధ్యంలో ఉద్యోగాలు ఇవ్వాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ అన్నారు. సోమవారం పట్టణంలోని టీఎన్‌జీవో భవన్‌లో నిరుద్యోగ ఉద్యమ కళాకారులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నిరుద్యోగ కళాకారుల సంఘాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా గుడాల సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా పుల్లెల రమేష్, కార్యదర్శిగా స్వామి, సహాయ కార్యదర్శిగా శేఖర్‌లను ఎన్నుకున్నారు.

### లింగారెడ్డిపేట్‌లో విషాదఛాయలు

**మనోహరాబాద్(తూప్రాన్):** రైలు ప్రమాదంలో మృతి చెందిన తండ్రి కూతుళ్ల అంత్యక్రియలతో లింగారెడ్డిపేట్ గ్రామంలో రోదనలు మిన్నంటాయి. వివరాల్లోకి వెళ్తే.. మనోహరాబాద్ మండలం లింగారెడ్డిపేట్ గ్రామానికి చెందిన తోగరి కృష్ణ (42) మేడ్చల్‌లో కుటుంబంతో నివాసం ఉంటూ రైల్వేలో గ్యాంగ్‌మెన్‌గా పనులు చేస్తున్నాడు. ఆదివారం గౌడవెల్లి వద్ద రైలు ప్రమాదంలో కృష్ణ, అతడి ఇద్దరి కూతుళ్ల వర్షిత (12), వరిణీ(5) మృతి చెందారు. గాంధీలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాలను గ్రామానికి తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర ఫారెస్ట్ డెవలప్‌మెంట్ చైర్మన్ వంటేరూ ప్రతాప్‌రెడ్డి, మండల నాయకులు, పలువురు హాజరై నివాళులర్పించారు.

### ఘనంగా ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

**మెదక్ మున్సిపాలిటీ:** ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం మెదక్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏఐఎస్ఎఫ్ అధ్యక్షుడు రాజు ముఖ్య అతిథిగా విచ్చేసి జెండాను ఆవిష్కరించారు.



రాయిలాపూర్‌లో నర్సరీని శుభ్రం చేయిస్తున్న ఏపీఓ పుణ్యదాస్

# నర్సరీలో క్లీన్ అండ్ గ్రీన్

సాక్షి ఎఫెక్ట్

**కౌడిపల్లి(నర్సాపూర్):** మండలంలోని రాయిలాపూర్ వన నర్సరీలో ఉపాధిహామీ అధికారులు తనిఖీ చేసి, శుభ్రం చేయించారు. సోమవారం సాక్షి దినపత్రికలో ఇదే నిర్లక్ష్యం! అనే శీర్షికతో వన నర్సరీలోని పరిస్థితులపై ప్రత్యేక కథనం ప్రచురితమైంది. దీంతో డీఆర్‌డీఓ ఆదేశాలతో ఏపీఓ పుణ్యదాస్ గ్రామానికి వెళ్లి వననర్సరీని పరిశీలించారు. చిరిగిపోయి చిందర వందరగా ఉన్న గ్రీన్‌నెట్ షెడ్‌ను తీసేశారు. వననర్సరీలోకి పశువులు రాకుండా చర్యలు తీసుకొని పిచ్చిమొక్కలు తొలగించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సలీం, గ్రామస్తులు పాల్గొన్నారు.

# కూకుట్లపల్లి పాఠశాల పరిశీలన

**కౌడిపల్లి(నర్సాపూర్):** మండలంలోని కూకుట్లపల్లి ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ బుచ్చానాయక్ సోమవారం పరిశీలించారు. ఈనెల 11న సాక్షి దినపత్రికలో ఇటు వ్యథ.. అటు వృథా అన్న శీర్షికతో పాఠశాల సమస్యలపై ప్రత్యేక కథనం ప్రచురితమైంది. దీంతో అధికారులు స్పందించారు. డీఈఓ ఆదేశాలతో ఎంఈఓ బుచ్చానాయక్ కూకుట్లపల్లి గ్రామానికి వెళ్లి, ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. ప్రస్తుతం శిథిలావస్థలో కొనసాగుతున్న పాఠశాల భవనాన్ని, వృథాగా ఉన్న కొత్త భవనాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మన ఊరు – మన బడి పనులను చూసి, మంచినీటి సౌకర్యం, చిన్న చిన్న పనులు మిగిలి ఉన్నాయని చెప్పారు. నీటి సౌకర్యం కోసం మిషన్ భగీరథ ఏఈ సురేష్‌తో మాట్లాడినట్లు తెలిపారు. పాఠశాల కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనులు త్వరగా పూర్తిచేస్తానని అన్నారు. పాఠశాలను తరలించేందుకు చర్యలు తీసుకుంటామని ఎంఈఓ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం రాంచెందర్, ఉపాధ్యాయుడు వెంకటేశం, సీఆర్‌పీ ఆంజనేయులు ఉన్నారు.



కూకుట్లపల్లిలో పనులు పూర్తి చేయాలని చెప్తున్న ఎంఈఓ బుచ్చానాయక్

# రోడ్డంతా బురదమయమే

## అవస్థలు పడుతున్న విద్యార్థులు, ప్రజలు

- అంబులెన్స్ సేవలకు నోచుకోని గిరిజన తండాలు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

**నర్సాపూర్ రూరల్:** వర్షాకాలంలో రోడ్లన్ని బురదమయం అవుతున్నాయి. దీంతో విద్యార్థులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. తండాల్లోకి అంబులెన్స్ కూడా రావడానికి వీలు లేకుండా రోడ్డంతా బురదమయం అయింది.

నర్సాపూర్ మండలంలోని పిల్లికుంట పంచాయతీ పరిధిలోని జీ.పోచమ్మ తండా మట్టిరోడ్డు అధ్వానంగా ఉంది. వెంకట్‌రావుపేట్ – అహ్మద్‌నగర్ ఫీడబ్ల్యూ రోడ్డు నుంచి జీ.పోచమ్మతండాకు వరకు ఉన్న మూడు కిలోమీటర్ల మట్టిరోడ్డు ఉంది. ఈ మట్టిరోడ్డును కొన్నేళ్లుగా ఎదురైన నాయకులను, అధికారులకు విన్నవించిన ఎవరు పట్టించుకోవడం లేదని తండా గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. తండాలో ఎవరికైనా అనారోగ్యం, డెలివరీ, ఇతర అత్యవసర సమయంలో అంబులెన్స్‌తో పాటు ఇతర వాహనాలు వెళ్లాలంటే పూర్తిగా బురదమయంగా ఉండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. ముఖ్యంగా వర్షాకాలం వచ్చిందంటే వృద్ధులు, గర్భిణులు, మహిళలు, విద్యార్థులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. తండా విద్యార్థులు, అహ్మద్‌నగర్, కౌడిపల్లి మండలం వెంకట్రావుపేట, నర్సాపూర్ ఉండడంతో సమావేశం సమయంలో పాఠశాలలు, కళాశాలకు వెళ్లాలంటే బురద రోడ్డును దాటుతూ నరకం అనుభవిస్తున్నారు. తండాలో 60 కుటుంబాల వరకు సుమారు 300 జనాభా ఉంటుంది. ఓట్ల సమయంలో మాత్రం నాయకులు పలుమార్లు హామీ ఇచ్చి రోడ్డు వేయడం మర్చిపోతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి మట్టిరోడ్డును, తారురోడ్డుగా మార్చాలని గిరిజనులు కోరుతున్నారు.



బురదలోనే పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులు

### పలుమార్లు మొరపెట్టుకున్నాం



కొన్నేళ్లుగా మూడు కిలోమీటర్ల మేర మట్టి రోడ్డును తారు రోడ్డుగా మార్చాలని నాయకులు, అధికారులతో తండావాసులమంతా కలిసి మొరపెట్టుకున్నాం. కానీ ఎవరూ పట్టించుకోవడంలేదు. ముఖ్యంగా అత్యవసర సమయాల్లో ఆస్పత్రులకు వెళ్లాలంటే చాలా ఇబ్బందులు పడుతున్నాం. కనీసం 108, ఇతర వాహనాలు రాలేని పరిస్థితి ప్రతీ వర్షాకాలంలో ఉంటుంది.

– కట్రోత్ శంకర్ నాయక్, తండా వాసి

### కరాటేలో విద్యార్థుల ప్రతిభ

**చిలప్‌చెడ్(నర్సాపూర్):** అంతర్జాతీయ కుంగ్–ఫూ, కరాటే పోటీలలో మండలంలోని ఫైజాబాద్ ఉన్నత పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించడం హర్షించదగ్గ విషయమని పాఠశాల హెచ్ఎం తారాసింగ్ అన్నారు. సోమవారం ఆయన పాఠశాల సిబ్బందితో కలిసి, కరాటే శిక్షకుడు నవీన్, పతకాలు సాధించిన విద్యార్థులను ఘనంగా సన్మానించారు. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో ఆదివారం జరిగిన ఓపెన్ ఇంటర్నేషనల్ కుంగ్–ఫూ, కరాటే చాంపియన్‌షిప్ స్పారింగ్ పలు కేజీల విభాగాల్లో జరిగిన పోటీల్లో ఫైజాబాద్ న్నత పాఠశాల విద్యార్థులు అక్షిత బంగారు పతకం, హారీశ్ వెండి పతకం, శివకేశవ కాంస్య పతకాలు సాధించారు.



పతకాలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

### వీల్‌చైర్ పంపిణీ



వీల్‌చైర్ అందిస్తున్న బ్రహ్మాజీ

**మెదక్ కలెక్టరేట్:** వీల్ చైర్ కోసం దరఖాస్తు చేసుకున్న దివ్యాంగుడికి జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ అధికారి బ్రహ్మాజీ వీల్‌చైర్ అందజేశారు. సోమవారం మెదక్ కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో పట్టణంలోని 19వ వార్డు చెందిన మహ్మద్ సల్మాన్ అలీ అనే దివ్యాంగుడు దరఖాస్తు చేసుకున్నాడు.దీంతో స్పందించిన ఆమె అక్కడే అతనికి వీల్‌చైర్ అందజేశారు.

### ప్లాట్లు ఇప్పించండి

**మెదక్ కలెక్టరేట్:** ఐడీఎస్ఎంటీ ఫేస్–2 కింద 2008లోదరఖాస్తు చేసుకున్న తమకు మెదక్‌లో ప్లాట్లు ఇప్పించాలని దరఖాస్తుదారులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. అప్పటి నిబంధనల ప్రకారం అన్ని పన్నులు చెల్లించిన వారికి న్యాయం జరగడం లేదన్నారు. 40 మంది లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు.

### కుమారుడి ఆచూకీ చెప్పండి



పోచయ్య(ఫైల్)

**హవేళిఘణాపూర్(మెదక్):** అత్తగారింటికి వెళ్తొస్తానని వెళ్లిన తన కుమారుడు ఇంటికి రాలేదని మండలంలోని మగ్దూంపూర్‌కు చెందిన బండలకాడి పోచయ్య మెదక్‌రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సోమవారం తన కుమారుడు బండలకాడి చిన్న కృష్ణ ఈ నెల 8న తన అత్తవారింటికి వెళ్తొస్తానని చెప్పి వెళ్లి, తిరిగి రాలేదన్నారు. బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తన కుమారుడి ఆచూకీ తెలుపాలన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మురళి తెలిపారు.

# ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేయాలి




నర్సాపూర్‌లో చేపట్టిన ర్యాలీలో పాల్గొన్న బీజేపీ, బీజేవైఎం నాయకులు, విద్యార్థులు

బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంతోష్

**నర్సాపూర్:** అందరూ తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేయాలని బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంతోష్ అన్నారు. పట్టణంలో సోమవారం బీజేవైఎం ఆధ్వర్యంలో హర్‌ఘర్ తిరంగా ర్యాలీ చౌరస్తా నుంచి ఎంపీడీఓ కార్యాలయం వరకు నిర్వహించారు. ర్యాలీలో బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంతోష్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేందర్, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్న రమేశ్‌గౌడ్, బీజేవైఎం నాయకులు భరత్, శ్రీకాంత్, రవి, పాండు తదితరులు పాల్గొన్నారు.

### సన్మానం

**వెల్దుర్తి(తూప్రాన్):** వెల్దుర్తి ఎస్ఐగా రాజు ఇటీవల బాధ్యతలు స్వీకరించారు. దీంతో సోమవారం రైతు రక్షణ సమితి నాయకులు ఎస్ఐను మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు మైసయ్య, జిల్లా కోశాధికారి అంతంగారి వెంకటేశం ఉన్నారు.

**నిజాంపేట(మెదక్):** మండల పరిధిలోని తిప్పన్నగుల్ల గ్రామంలో బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. పాఠశాలలో పనిచేసి బదిలీపై వేరే పాఠశాలకు వెళ్లిన ఉపాధ్యాయులును సన్మానించారు. కార్యక్రమంలో కల్వకుంట కాంప్లెక్స్ హెచ్ఎం మాధురి దేవి, పాఠశాల హెచ్ఎం సుభాషిణి, ఉపాధ్యాయులు, ఏపీసీ చైర్మన్, గ్రామస్తులు పాల్గొన్నారు.



నిజాంపేట(మెదక్): తిప్పన్నగుల్ల గ్రామంలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న హెచ్ఎం

**చెన్నాయిపల్లిలో..**

**చిన్నశంకరంపేట(మెదక్):** మండలంలోని చెన్నాయిపల్లి ప్రాథమిక పాఠశాల హెచ్ఎం కృష్ణమూర్తి బదిలీపై వెళ్లారు. పాఠశాలలో గ్రామస్తులు హెచ్ఎంను గ్రామస్తులు సన్మానించారు. అలాగే బదిలీపై వెళ్లిన గ్రామ కార్యదర్శి కల్పనను కూడా గ్రామస్తులు సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు మల్లేశం, సిద్ధిరాములు, నాగరాజు పాల్గొన్నారు.

## సంక్షిప్త వార్తలు

**◆ పాఠశాలకు సౌండ్ సిస్టం బహూకరణ**

**చేగుంట(తూప్రాన్):** మండల కేంద్రం చేగుంట ఉన్నత పాఠశాలకు బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుడు చక్రధర్ పాఠశాల కోసం సౌండ్ సిస్టం బహూకరించారు. కార్యక్రమంలో హెచ్ఎం నీరజ, ఉపాధ్యాయులు రాజేశ్వర్, రఘుపతి, సుధాకర్‌రెడ్డి, లక్ష్మణ్, వెంకటేశ్, మనోహర్, సురేందర్, రాధ, భవానీ, శ్రీవాణి, సరస్వతి, రమాదేవి, ఉమాదేవి, శారద, శృతి, సత్యనారాయణ, రమేశ్, పాల్గొన్నారు.

**◆ శివ్వంపేటలో ఇరు పార్టీల డీజే లొల్లి**

**శివ్వంపేట(నర్సాపూర్):** మండల కేంద్రంలో ఆదివారం రాత్రి బోనాల ఉత్సవాల సందర్భంగా రెండు పార్టీల డీజేల ఏర్పాటుతో గొడవ చోటుచేసుకుంది. అనంతరం రాత్రి కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు గ్రూపులు వేర్వేరుగా డీజేలు ఏర్పాటు చేసి తొట్టెల ఊరేగింపు నిర్వహించారు. దీంతో వారిలో పలువురు గొడవ చేశారు. పోలీసులు చేరుకొని ఇరు పార్టీల డీజేల నిలిపివేయించారు.

**◆ చికిత్స పొందుతూ వ్యక్తి మృతి**

**నర్సాపూర్ రూరల్:** పురుగుల మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మృతి చెందినట్లు నర్సాపూర్ ఎస్ఐ లింగం తెలిపారు. మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన గంట కృష్ణ (50) ఆర్థిక ఇబ్బందులతో ఆదివారం సాయంత్రం పురుగుల మందు తాగాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంగారెడ్డి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐలింగం తెలిపారు.

**◆ వృద్ధురాలి మెడలో నుంచి బంగారం చోరీ**

**రామాయంపేట(మెదక్):** ఇంటి ఎదుట కూర్చున్న వృద్ధురాలి మెడలో నుంచి బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లిన ఘటన సోమవారం రాత్రి పట్టణంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. పట్టణానికి చెందిన చంద్రపు అనసూయమ్మ మార్కెట్ ప్రాంతంలో నివాసం ఉంటుంది. రాత్రి ఏడు గంటల ప్రాంతంలో ఇంటి ముందు కూర్చోగా బైక్‌పై వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి ఆమె మెడలో పుస్తెలతాడు తెంచుకొని పారిపోయాడు. ఈ క్రమంలోనే ఆమె కింద పడిపోగా గాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈవిషయమై తమకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

# ఇష్టంతో విధులు నిర్వహించండి

ఎంపీడీఓ శ్రీనివాస్

**కౌడిపల్లి(నర్సాపూర్):** ఇష్టంతో విధులు నిర్వహించినట్లయితే ఎలాంటి ఇబ్బందులు ఉండవని ఎంపీడీఓ శ్రీనివాస్ అన్నారు. సోమవారం కౌడిపల్లిలో ఇటీవల బదిలీపై వెళ్లిన గోల్యానాయక్, బషీరొద్దీన్, వెంకటేశం, సాజిదబేగం, శైలజ, ప్రశాంత్, ఓఎస్ వెంకటేశంతో పాటు మండలానికి కొత్తగా వచ్చిన పంచాయతీ కార్యదర్శులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధిలో పంచాయతీ కార్యదర్శులు కీలకమన్నారు. ఏరోజు పనులు ఆరోజు ఇష్టంతో పూర్తిచేయాలన్నారు. దీంతో సమస్యలు రావని ధైర్యంగా విధులు నిర్వహించాలని చెప్పారు. గ్రామానికి, మండలానికి మంచిపేరు తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌డిప్యూటీఈఈ అమరేశ్వర్, ఎంపీఓ కలీముల్ల, ఏపీఓ పుణ్యదాస్, సీనియర్ అసిస్టెంట్ బలరాం, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



పంచాయతీ కార్యదర్శులను సన్మానిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాస్

# చిరుసంచుల వరిసాగుతో అధిక దిగుబడి

సంగుపేట శాస్త్రవేత్త రాహుల్ విశ్వకర్మ

**చిలప్‌చెడ్(నర్సాపూర్):** రైతుల ఆసక్తితోనే చిరుసంచుల వరిసాగుతో అధిక దిగుబడి సాధ్యమవుతుందని సంగుపేట ఏరువాక శాస్త్రవేత్త రాహుల్ విశ్వకర్మ అన్నారు. సోమవారం ఆయన మండలంలోని చండూర్ గ్రామానికి చెందిన చౌటకూరి చంద్రశేఖర్ రెడ్డికి అందించిన పలురకాల సన్నరకం చిరుసంచుల వరిసాగును పరిశీలించారు. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ.. చంద్రశేఖర్‌రెడ్డికి అందించిన కేపీఎస్– 10631, కూనారం–12368అనే రకాలు ప్రస్తుతం చాలా బాగున్నాయన్నారు. ఈ రకం విత్తనాలు 125 – 130 రోజుల కాలపరిమితిలో ఎకరాకు 26–30 క్వింటాళ్ల దిగుబడి వస్తుందన్నారు. కాగా రైతు చంద్రశేఖర్ మా శాస్త్రవేత్తల నమ్మకంతో ఆ చిరుసంచుల విత్తనాల వరిసాగు చేయడం హర్షనీయమన్నారు. మేం అందించిన విత్తనాలు, రైతు వరి సాగు పద్ధతులతో, ప్రస్తుత దశలో పంట అద్భుతంగా ఉందన్నారు. పంట కోసే వరకు పంటపొలాలను, రైతు పాటించే పద్ధతులను పర్యవేక్షిస్తూ, తగిన సలహాలు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏరువాక శాస్త్రవేత్త సరిత, రైతు చంద్రశేఖర్‌రెడ్డి ఉన్నారు.



వరిసాగును పరిశీలిస్తున్న ఏరువాక శాస్త్రవేత్తలు రాహుల్, సరిత

### ఉద్యోగ భద్రత కల్పించాలి

**నర్సాపూర్:** సమగ్ర శిక్షా ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఎమ్మార్సీలో పని చేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు ప్రభుత్వాన్ని కోరారు. ఇటీవల మరణించిన సమగ్ర శిక్షా ఉద్యోగుల చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. సోమవారం ఈ సందర్భంగా ఉద్యోగులు సుధాకర్‌గౌడ్, రూప, భైరవ్‌రెడ్డి, సుజాత, స్వరూపరాణి, పద్మ, వీరబ్రహ్మంచారి, యాదగిరి, హరికృష్ణ మాట్లాడుతూ.. తమకు ఉద్యోగ భద్రత లేనందున పలువురు పని ఒత్తిడికి లోనై గుండెపోటుతో నెల రోజుల్లో రాష్ట్రంలో ముగ్గురు మరణించారని చెప్పారు.

**ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి**

**కౌడిపల్లి(నర్సాపూర్):** ఎస్ఎస్ఏ (సర్వ శిక్షణ అభియాన్) ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని మండల ఎస్ఎస్ఏ ఉద్యోగులు డిమాండ్ చేశారు. సోమవారం ఎమ్మార్సీ ఎదుట ఇటీవల మృతి చెందిన పలువురు ఎస్ఎస్ఏ ఉద్యోగుల చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్ఎస్ఏ ఉద్యోగులు ఆంజనేయులు, నరేష్ తదితరులు మాట్లాడుతూ.. ఎస్ఎస్ఏ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించి బేసిక్ పే అమలు చేయాలన్నారు. ఆరోగ్య బీమా రూ. 5లక్షలు, జీవితబీమా రూ. 10లక్షల సౌకర్యం కల్పించాలన్నారు. ఉద్యోగ విరమణ చేసేవారికి రూ.10లక్షల రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలన్నారు. చనిపోయిన ఉద్యోగుల కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీ అంజయ్య, మొగులయ్య, అఖిల, సంజీవులు పాల్గొన్నారు.



నర్సాపూర్: నివాళులర్పిస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

**అల్లాదుర్గంలో..**

**అల్లాదుర్గం(మెదక్):** సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులందరినీ రెగ్యూలరైజ్ చేయాలని ఎస్ఎస్ఏ ఉద్యోగులు ప్రభుత్వాన్ని డిమండ్ చేశారు. మరణించిన ఎస్ఎస్ఏ ఉద్యోగులకు భోజన విరామ సమయంలో సోమవారం ఎమ్మార్సీ భవనంలో నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బాలరాజు, పవిత్ర, శంశొద్దీన్, వేణుమాధవ్, ఈశ్వరయ్య, సత్యంగౌడ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆలయంలో శ్రావణమాస పూజలు



హవేళిఘణాపూర్(మెదక్): సిద్దేశ్వర ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

**హవేళిఘణాపూర్(మెదక్):** మండల పరిధిలోని ముత్తాయికోట సిద్దేశ్వర ఆలయంలో శ్రావణ సోమవారం సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చిన అర్చనలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు గోవింద్ మహరాజ్ పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

**ఉమా సంగమేశ్వర ఆలయంలో..**

**పెద్దశంకరంపేట(మెదక్):** మండల పరిధిలోని కొప్పోల్‌ని ఉమా సంగమేశ్వర ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. శ్రావణమాస సోమవారం సందర్భంగా భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వ్యాపారులు గడ్డం వెంకటేశం, గడ్డం మల్లేశం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

### భక్తిశ్రద్ధలతో బోనాల ఊరేగింపు

**వెల్దుర్తి(తూప్రాన్):** శ్రావణమాసం పురస్కరించుకొని మండలంలోని పలు గ్రామాల్లో బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. సోమవారం ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి, ఒడిబియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.



బోనాలు ఊరేగింపులో భక్తులు